క్లుప్తంగా

అధినేతతో ఆత్మీయ కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో కార్పొరేటర్ ఇమ్రాన్ తదితరులు

గాజువాక: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సమావేశం అనంతరం మాజీ ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి సమక్షంలో తన సోదరుడు మహ్మద్ లుక్మాన్‌తో జగన్ మోహన్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పౌష్టికాహారం, చీరల పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న దాతలు

గాజువాక: యాక్సెప్ట్ సీసీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గాజువాకలో 40 మంది పేదలకు పౌష్టికాహారం, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వేలువల్లి ఫౌండేషన్ సహకారంతో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో దాతలు చంద్రబోస్, మేరీ సుజాత మాట్లాడుతూ పేదలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో తాము ఈ వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో యాక్సెప్ట్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్ కుమార్, ప్రతినిధులు జయమ్మ, కోమలి, జాన్సన్, రవిరాజు, వేలువల్లి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె పంపిణీ



కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె అందజేస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డుకు చెందిన పారిశుధ్య కార్మికుల స్వీయ ఆరోగ్య పరిరక్షణ కోసం వార్డు కార్పొరేటర్ పలు జాగ్రత్తలు తీసుకున్నారు. బుధవారం పారిశుధ్య కార్మికులకు మిందిలో సబ్బులు, కొబ్బరి నూనెను గుడివాడ అనూష స్వయంగా అందజేశారు.

అన్న సమారాధన నేడు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం పరిధిలోని గెంజిపేటలో హనుమత్ జయంతిని పురస్కరించుకొని గురువారం మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి గెంజి సురేష్ తెలిపారు. గెంజిపైడితల్లి, సింహాచలం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వరుసగా 11 ఏళ్ల నుంచి అన్న సమారాధన చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

24న క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక: లీ ఫార్మాలో ఉద్యోగాల భర్తీకి టీవీ స్టార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఈనెల 24న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. బీఎస్సీ ఎంపీసీ, సీబీజెడ్, సీఎంబీటీ, సీబీసీబీటీ విద్యార్థులు, ఎమ్మెస్సీ ఆర్గానిక్, ఎనలిటికల్ కెమిస్ట్రీ విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం కనులపండువగా జరిపించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువు దీర్చి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో నిర్వహించిన వేడుకలో స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై కొలువుదీర్చారు. అష్టోత్తర శతనామావళి అనంతరం హారతి ఇచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

కాలుష్య కాటు!



జాతీయ రహదారిపైకి బాయిలర్ల నుంచి వెలువడుతున్న పొగ

- ఉక్కిరిబిక్కిరి అవుతున్న అక్కిరెడ్డిపాలెం వాసులు
- గ్రామాన్ని కమ్మేస్తున్న పొగ
- కలుషితమవుతున్న నీరు
- పట్టించుకోని యాజమాన్యం

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీని ఆనుకొని ఉన్న అక్కిరెడ్డిపాలెం గ్రామాన్ని కాలుష్యం కమ్మేస్తుంది. సుమారు 30 వేల జనాభా ఉన్న గ్రామంలో నీరు, గాలి, నేల కాలుష్యం అవుతున్నా యాజమాన్యం మాత్రం పట్టించుకోవడం లేదు. వ్యర్థాల వల్ల ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నా ఇదంతా షరామామూలే అంటూ వ్యవహరిస్తోంది. టెక్నాలజీ విస్తరించిన కాలంలో డెయిరీ నుంచి విడుదలయ్యే కాలుష్య కారకాలను నివారించడం కష్టం కాకపోయినా యాజమాన్యం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

వ్యాధుల ముప్పు

డెయిరీ కాలుష్యానికి గురైన అక్కిరెడ్డిపాలెంలో ఇప్పటికే చాలా మంది ఫ్లోరోసిస్ బారిన పడి కాళ్లు, చేతులు వంకర్లు పోతున్నాయని అంటున్నారు. పిల్లలు ఎముకల వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారని వాపోతున్నారు. గ్రామంలో బోరుబావులున్నా నీరు దేనికి ఉపయోగం లేకుండా పోతుంది.

రసాయన వ్యర్థాలతో అవస్థలు

డెయిరీలో పాలు దగ్గర నుంచి పాల పదార్థాలు తయారవుతుంటాయి. వీటి ప్రాసెస్ చేయడానికి వినియోగించే రసాయనాలు తద్వారా వ్యర్థ రసాయనాలుగా ద్రవరూపంలో, వాయు రూపంలో బహిరంగంగా విడుదల చేస్తుంటారు. ఇలా విడుదల చేసే రసాయనాలు కాలువల ద్వారా విడుదల చేయడంతో పరిసర భూములన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామ శివారు ప్రాంతం నుంచి కాలువలో ఈ వ్యర్థాలను బహిరంగంగా విడుదల చేస్తున్నారు. దీంతో భూ గర్భజలాలు కలుషితమవుతున్నాయి. పాలను, పాల పదార్థాల ప్రాసెస్ బొగ్గుతో బాయిల్ చేస్తుండడంతో వెలువడే పొగ పరిసర ప్రాంతాలను కమ్మేస్తుంది. మెత్తటి పౌడర్ ఇంట్లో సామగ్రిపైకి చేరుతుందని వాపోతున్నారు.



విశాఖ డెయిరీ నుంచి విడుదలైన రసాయన వ్యర్థాలు



డెయిరీలో వివిధ రకాల ఉత్పత్తుల తయారీ కేంద్రం

ప్రజలకు దక్కని భరోసా

గ్రామాన్ని విశాఖ డెయిరీ దత్తత తీసుకోవాలని, నెలకో సారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వ్యాధుల బారిన పడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం, ఉచితంగా మందులు అందజేయాలని కోరినా పట్టించుకోలేదు. లాభాలను ఆర్జిస్తూ డెయిరీ యాజమాన్యం తమ గ్రామాన్ని నిర్లక్ష్యం చేస్తుందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా భూములను తీసుకుని వ్యాపారం చేస్తూ తమకు భరోసా లేకుండా పోతుందని మండిపడుతున్నారు. కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, లేబర్, ఐటీ, వంటి విభాగాల అధికారులు అప్పుడప్పుడు హడావుడి చేసి వెళ్లిపోతున్నారే తప్పా ప్రజలకు మేలు చేసే చర్యలు తీసుకోవడం లేదంటున్నారు.

కాలుష్యంతో సతమతం



విశాఖ డెయిరీని ఆనుకొని ఉన్న అక్కిరెడ్డిపాలెం ప్రజలు కాలుష్యంతో నరకం చూస్తున్నారు. చిన్న పిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు ఫ్లోరోసిస్ బారిన పడుతున్నారు. గ్రామాన్ని డెయిరీ దత్తత తీసుకుంటామని మోసం చేసింది. నెలకోసారి మెడికల్ క్యాంప్ పెట్టాలి. ఉచితంగా మందులు అందజేయాలి. యాజమాన్యం గుడికి చందా ఇస్తానని మోసం చేసింది. యాజమాన్యం తన స్వార్థం చూసుకుంటుందే తప్పా ప్రజలను పట్టించుకోవడం లేదు.

– సంద్రాన నూకరాజు, గ్రామ నాయకుడు, అక్కిరెడ్డిపాలెం

పోరాటాలు చేస్తున్నా...



విశాఖ డెయిరీ నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల నివాసాల్లోకి మెత్తటి పొడి రూపంలో వచ్చి చేరుతుంది. నీటి ద్వారా రసాయనాలను విడుదల చేస్తున్నారు. దీంతో గ్రామంలో ఎక్కడ వ్యవసాయ భూములున్నా నిరుపయోగమే. యాజమాన్యం లాభాలు చూసుకోవడం తప్పా డెయిరీని ఆనుకొని ఉన్న అక్కిరెడ్డిపాలెం గ్రామం పరిస్థితి ఏంటని ఆలోచించడం లేదు. సమస్యలపై పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

– ఎ.లోకేష్, సీపీఎం గాజువాక జోన్ నాయకుడు, అక్కిరెడ్డిపాలెం

బీమా సొమ్ము ఎగవేతకు అడ్డదారులా?

- బీమా సంస్థపై ఐఆర్‌డీఏఐకు ఫిర్యాదు
- వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామ అప్పారావు

అగనంపూడి: పాలసీదారులకు బీమా సొమ్ము చెల్లింపులో బీమా సంస్థలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ పట్టా రామ అప్పారావు ఆరోపించారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలసీదారులు మృతి చెందిన పక్షంలో వారికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించకుండా అడ్డదారులు వెతుకుతూ పాలసీదారులను నట్టేట ముంచడానికి యత్నాలు చేస్తుండడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తూ మృతిచెందిన ఇద్దరి విషయంలో భిన్న వైఖరి అవలంబిస్తూ పాలసీదారులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు యాజమాన్యం సీతిన అచ్యుతరావు కుటుంబానికి కారుణ్య నియామకం ఇవ్వకపోవడంతో పాలసీ మొత్తాన్ని చెల్లించబోమని బీమా సంస్థ జవాబుచ్చిందని, అదే మరో కార్మికుడు విందుల రామారావు మృతిచెందితే ఆయన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ఇచ్చినా బీమా సంస్థ పాలసీ సొమ్ము చెల్లించేదిలేదని చెప్పడం సరికాదన్నారు. ఈ విషయంపై ఐఆర్‌డీఏఐకి ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు.

రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నాయకుల నివాళి



పాతగాజువాక జంక్షన్‌లో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాజువాక: మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా పాతగాజువాక జంక్షన్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆ పార్టీ నాయకుడు గవర వెంకట రమణ ప్రధానమంత్రిగా రాజీవ్‌గాంధీ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు లక్కరాజు రామారావు, ఉరుకూటి అచ్చిబాబు, పి.ఎల్.ఎన్.గుప్త, షేక్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

- పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు ఆధ్వర్యంలో పాతగాజువాకలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు యరబాల భూలోక, ఎం.ఎస్. వర్మ, ములకలపల్లి రాజబాబు, కోరాడ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి

పెదగంట్యాడ: మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతిని మండలంలోని నడుపూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, భూలోక, వర్మ, చిన్నారావు, రాజబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఉత్సవాల పోస్టర్ విడుదల



కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవత బంగారు మాంబ, నూకాంబిక అమ్మవార్ల హోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ ప్రతినిధులు నవరాత్రి మహోత్సవాల కరపత్రాన్ని బంగారు మాంబ ఆలయంలో విడుదల చేశారు. శతకంపట్టు వద్ద పండగ చాటింపుతో ఉత్సవాలు ప్రారంభమై ఈ నెల 29న బంగారుమాంబ అనుపుతో ముగుస్తాయని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు గోపిశెట్టి శ్రీనివాసరావు, పల్లెల శ్రీనివాసరావు, గవర వెంకటరమణారావు, సంద్రాన శ్రీనివాసరావు, గోపిశెట్టి సోమినాయుడు, సంద్రాన కిషోర్, గోపిశెట్టి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌పై వర్షం ఎఫెక్ట్



చెరువును తలపిస్తున్న అక్కిరెడ్డిపాలెం మైదానం

అక్కిరెడ్డిపాలెం: సమ్మర్ క్యాంప్‌కు వర్షాలు ఆటంకం కలిగిస్తున్నాయి. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పీడీ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. స్కూల్ ఎదురుగా గల మైదానం సమ్మర్ క్యాంప్‌కు ఎంతో అనువుగా ఉంది. అయితే రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మైదానంలో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో విద్యార్థులు ఆటలకు విరామం ఇచ్చారు.

డాక్టర్ మహేశ్వరరెడ్డికి సత్కారం



మహేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న అండిబోయిన లక్ష్మి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కుకి చెందిన గొందేశి మహేశ్వరరెడ్డిని ఏపీ యాత సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు అండిబోయిన లక్ష్మి బుధవారం సత్కరించారు. సామాజిక సేవలందిస్తున్న మహేశ్వరరెడ్డికి ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ ప్రతినిధులు ఇటీవల ఢిల్లీలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ మేరకు ఆయనకు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అండిబోయిన అప్పారావు, వనుము నాగేశ్వరరావు, చప్పిడి నాగరాజు, బత్తిన అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెపై ప్రభుత్వ నిర్బంధం తగదు



జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

డాబాగార్డెన్స్: విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెపై కూటమి ప్రభుత్వం నిర్బంధం ఆపాలంటూ కమ్యూనిస్టులు బుధవారం జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహ్మాన్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కులోని 3 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను అమానుషంగా తొలగించిందన్నారు. మరో 2,600 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసిందని ఆరోపించారు. వేల సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులను అర్ధంతరంగా రోడ్డున పడేస్తే వారి కుటుంబాలు ఏం కావాలని ప్రశ్నించారు. కార్మికుల ఉపాధిని కాపాడి, వారి కుటుంబాలను ఆదుకోవల్సిన రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం నిరవధిక సమ్మె విచ్ఛిన్నానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వ చర్యలు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు కుట్రలు కొనసాగిస్తున్న మోదీ ప్రభుత్వానికి వత్తాసు పలకడమేనన్నారు. కూటమి పార్టీలు తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిర్బంధంపై ఆందోళనలు చేసి, ప్రజాస్వామ్య హక్కుల గురించి ప్రసంగాలిచ్చి, అధికారంలోకి రాగానే వాటిని మరచిపోయి నిర్బంధం ప్రయోగించడం ప్రజలు, కార్మికులను వంచించడమేనన్నారు. వేల సంఖ్యలో కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, విశాఖ ఎంపీ శ్రీభరత్ నోరు మెదపకపోవడం కార్మికులు, వారి కుటుంబాలకు ద్రోహం చేయడమేనన్నారు. కార్యక్రమంలో బి. జగన్, దేవసహాయం, కె. చంద్రశేఖర్, పి. మణి, మన్మథరావు, బి. ఈశ్వరమ్మ, ఎం. సుబ్బారావు, పి. పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు నేవీ శిక్షణ



శిక్షణ పొందిన ఎన్‌సీసీ క్యాడెట్లతో నేవీ అధికారులు



శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్ల విన్యాసాలు

అల్లిపురం: యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో భాగంగా ఏవీఎన్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు నేవీ అధికారులు శిక్షణ ఇచ్చారు. త్రీ ఆంధ్రా నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో నడుస్తున్న శిక్షణ శిబిరం ఈ నెల 13వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరుగుతుంది. శిక్షణలో భాగంగా క్యాడెట్లు వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. బోట్ పుల్లింగ్, సిమ్యులేటర్ ద్వారా కాల్పులు, రైఫిల్ షూటింగ్, టెంట్ పిచింగ్, డ్రిల్, రైఫిల్ డ్రిల్ సీమాఫోర్ వంటి అంశాలు నేర్చుకున్నారు. సివిల్ డిఫెన్స్ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ఎమర్జెన్సీ వైద్య సేవలు, సైబర్ సెక్యూరిటీ అవగాహన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కాలేజీలో ఉన్న బోటనీ, జువాలజీ మ్యూజియంలను క్యాడెట్లు సందర్శించారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా క్యాంపు పరిసరాలను శుభ్రం చేశారు. ఆల్ ఇండియా సైనిక్ కాంపిటీషన్ 2025 కోసం శిక్షణ అందజేశారు. బుధవారం బడా ఖానాతో ఈ క్యాంపు ముగిసింది. వివిధ పాఠశాలలు, కాలేజీల నుంచి వచ్చిన క్యాడెట్లు పాల్గొన్నారు.

విదేశీ సిగరెట్ పెట్టెలు స్వాధీనం



పట్టుబడ్డ సిగరెట్ పెట్టెలు

అక్కిరెడ్డిపాలెం: చినగంట్యాడ – కణితి రోడ్డులో జగ్గు జంక్షన్ వద్ద గల కింతలి చంద్రమౌళి కిరణా షాపులో అనుమతులు లేకుండా విదేశీ సిగరెట్లు ఉన్నాయన్న సమాచారంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ బృందం దాడి చేసింది. సీటీఎఫ్ బృందం వెంటనే అతన్ని పట్టుకుని విదేశీ సిగరెట్ల స్వాధీం చేసుకుంది. బ్లాక్ డైరున్ 38 ప్యాకెట్లు, ఎస్సే లైట్లు 8 బండిల్స్, ఎస్సే గోల్డ్ (స్పెషల్) 50 ప్యాకెట్లు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని గాజువాక పోలీసులకు అప్పగించారు.